క్లుప్తంగా

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



దాచేపల్లి : వివాహిత మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జీ పాపారావు బుధవారం తెలిపారు. దాచేపల్లిలోని చాపలగడ్డకి చెందిన దానం నరేష్ భార్య ఆదిలక్ష్మీ(37) ఈ నెల 6వ తేదీన సరుకుల కోసం బజారుకి వెళ్లింది. బజారుకి వెళ్లిన ఆదిలక్ష్మీ ఇంటికి తిరిగి రాకపోవటంతో బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో నరేష్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాపారావు చెప్పారు. ఆదిలక్ష్మీ ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9059510752 నెంబర్‌ని సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దాచేపల్లి : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జీ పాపారావు బుధవారం తెలిపారు. మండలంలోని గామాలపాడుకి చెందిన బట్టు పరమేశ్వరరావు (60) గత డిసెంబర్ 15వ తేదీ నుంచి కనిపించటం లేదు. కుమారుడు సువర్ణ కుమార్ బంధువుల వద్ద ఆరా తీసిన ఆచూకి లభించలేదు. దీంతో సువర్ణకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తప్పుల తడకగా ఎస్సీ కులాల సామాజిక తనిఖీ జాబితా

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లో ఎస్సీ కులాల సామాజిక తనిఖీ లిస్ట్(సోషల్ ఆడిట్) తప్పుల తడకగా ఉందని స్థానిక టీడీపీ సీనియర్ నేత, మాల మహానాడు నాయకుడు కట్ట రాయప్ప అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల నిర్వాకంతో స్థానిక ఫిల్టర్ హౌస్ ఏరియాలో ఎస్సీ మాల కులానికి బదులు ఎస్సీ మాదిగ కులంగా పలు కుటుంబాల పేర్లు లిస్టులో నమోదు చేయబడ్డాయని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు లిస్టులో తప్పుగా ఉన్న పేర్లను క్షేత్రస్థాయిలో పునః పరిశీలన చేసి పారదర్శకంగా లిస్టును రూపొందించాలని కోరారు. దీనిపై స్థానిక వీఆర్వో రవికుమార్‌ను వివరణ కోరగా ఎస్సీ కులాల లిస్టులో కొన్ని పేర్లు తప్పుగా నమోదు అయ్యాయన్నారు. స్థానిక సచివాలయాలలో లిస్టును ప్రజలకు అందుబాటులో ఉంచామని, సరి చూసుకొని తప్పుగా కులం నమోదు అయిన వారు ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్లతో తక్షణమే సంప్రదిస్తే సరి చేస్తామన్నారు.

తామర పురుగుతో అప్రమత్తంగా ఉండాలి

ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి

పిడుగురాళ్ల/పిడుగురాళ్లరూరల్: పంటల్లో తామర పురుగుతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణ శివారు ప్రాంతంలోని పంట పొలాల్లో అలాగే మండలంలోని పెద్ద అగ్రహారం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కంది పంటల క్షేత్ర సందర్శన చేశారు. మిరప పంటలో తామర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున రైతులు సామూహికంగా నీలి, పసుపు రంగు అట్టలను పంట పొలంలో అక్కడక్కడ అమర్చి పురుగు ఉధృతిని గమనించాలని ఏవో తెలిపారు. అలాగే పొద్దు తిరుగుడు మొక్కలను అక్కడక్కడ ఎర పంటగా వేసుకోవాలని సూచించారు. కంది పంటలో పూత ఏపుగా ఉన్నందున రైతులు పూత రాలకుండా ముందస్తు జాగ్రత్తలు, వ్యవసాయాధికారులు తెలిపిన విధంగా మందులు వినియోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ విజయ భాస్కర్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.



కంది పంటలో సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రామాపురంలో పొలం పిలుస్తోంది

దాచేపల్లి : మండలంలోని రామాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏవో దొండేటి పాపకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, మిరప పంటలను పరిశీలించారు. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు ఇచ్చారు. సీసీఐలో క్వింటా పత్తికి రూ.7,521 మద్దతు ధర లభిస్తుందని, పంటల బీమా కూడా నమోదు చేసుకోవాలని ఏవో చెప్పారు.



పంటలు పరిశీలిస్తున్న ఏవో పాపకుమారి

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



మాచర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో ఉపాధ్యాయ సంఘాలు చూపిస్తున్న చొరవ, కృషి అమూల్యమని తులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ మురళీకృష్ణ కొనియాడారు. బుధవారం పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. అన్నదానం ఆకలిని తీర్చగలిగితే అక్షరజ్ఞానం అజ్ఞానాన్ని తొలగిస్తుందనే అంశంతో 10వ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఆర్థికంగా ఆదుకునేందుకు స్కాలర్‌షిప్‌లు తులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అందిస్తుందన్నారు. పరీక్షల సమయంలో స్టడీ అవర్స్ రెండు నెలల పాటు పౌష్టికాహారాన్ని అందిస్తామని తెలిపారు. ఎస్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.గంగాధర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థుల కోసం రూపొందించిన మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని, అందించిన తులసి ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ నాయకులు కృష్ణా నాయక్, జాను, డేవిడ్ విల్సన్, గోవిందరావు, భాస్కర్‌బాబు, కెనడీలున్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా పని చేయండి

ఏపీడీ కొరటా మల్లిఖార్జున్

మాచర్ల రూరల్: కూలీలకు కనీస వేతనం రూ.300 వచ్చేలా గ్రామంలో ఉపాధి హామీ పనులను రూపొందించటంలో ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఓలు క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా ఏపీడీ కొరటా మల్లిఖార్జున్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఆరు నెలల్లో గ్రామాల్లో చేపట్టబోయే పనులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రైతు కూలీకి మేలు జరిగేలా పనిచేయాలని, పొలంలో నీటి కుంటలు, ఫారం పాంట్సు, అమృత సరోవర్ చెరువుల అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. గ్రామాలలో రైతుల భూముల్లో నీటి కుంటలతో పాటు పంచాయతీల్లో ఒక చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్యాక్రమంలో ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ నాయక్, మాచర్ల, దుర్గి ఏపీఓలు తోట నాగ శ్రీనివాస్, జీసీహెచ్ వెంకటేశ్వర్లు, ఈసీ రవీంద్రనాయక్, మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ కొరటా మల్లిఖార్జున్

రైసు మిల్లు తనిఖీ



గురజాల : రైసు మిల్లును ఎంపీడీవో షేక్ గౌసియా బేగం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక గురజాల మెయిన్ రోడ్డులోని సప్తగిరి రైసు మిల్లును జనరల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైసు మిల్లులోని బియ్యం మొత్తం తనిఖీ చేయడం జరిగిందని అన్ని నిబంధనల ప్రకారం నడుపుతున్నారన్నారు. మిషనరీ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవోతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



విజయపురిసౌత్: మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన విజయపురిసౌత్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే విజయపురిసౌత్‌కు చెందిన బత్తుల కల్పన (28) ఉరి వేసుకుందంటూ భర్త సురేష్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. అనంతరం అనుమానం వచ్చిన వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు భర్త సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై దాడి.. కేసు నమోదు

యడ్లపాడు: వక్ఫ్‌బోర్డు భూములను పరిశీలించేందుకు వెళ్లిన ఆ శాఖ ఇన్‌స్పెక్టర్‌పై కొందరు దాడి చేశారు. దీనిపై యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా బాషా పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌గా మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పరిధిలోని కొండవీడు గ్రామంలో ఉన్న పురాతన హజరత్ బురావద్దీన్‌బాబా వారి దర్గా కింద వక్ఫ్ బోర్డుకు చెందిన 87.20 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. మూడేళ్లకు ఒకసారి వేలం పాటలో ఈ భూముల్ని దక్కించుకున్న రైతులు ఏటా శిస్తు చెల్లిస్తూ కౌలు చేసుకుంటారు. సదరు భూములకు మూడేళ్లుగా శిస్తు చెల్లింపులు చేయనందున వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి సందర్శనకు మంగళవారం మధ్యాహ్నం కరీముల్లా బాషా కొత్తపాలెం (పుట్టకోట) గ్రామంలోని దర్గాకు చెందిన భూముల్ని సందర్శించారు. సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తుండటం గమనించిన గ్రామానికి చెందిన కాకర్లపూడి మాధవరావు, మరో ఐదుగురు కలిసి ఆయనపై దాడికి పాల్పడ్డారు. అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. సెల్‌ఫోన్ లాక్కొని ధ్వంసం చేశారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఆదేశాల మేరకు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ వి.బాలకృష్ణ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ అవార్డు



డీఈఓ చంద్రకళ నుంచి అవార్డు అందుకుంటున్న షేక్ సైదా

మాచర్ల రూరల్: ఉపాధ్యాయులకు ధూళిపాళ్ళ గ్రామంలోని లయోలా కాలేజీలో పల్నాడు జిల్లా స్థాయి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ముగింపు సందర్భంగా అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం, ప్రవేశాల పెంపు తదితర అంశాలపై మాచర్ల మండలంలోని లింగాపురం గ్రామ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ సైదా ఇచ్చిన ప్రజెంటేషన్‌కు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రథమ బహుమతిని డీఈవో అందించారు. డీఈఓ చంద్రకళ, ఎంఈఓ అల్లి సురేష్ ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాటి రాజశేఖర్, రత్నప్రభ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు పాటించాలి



నరసరావుపేట టౌన్: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్‌ఎంపీలను డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి హెచ్చరించారు. బుధవారం తన కార్యాలయంలో జిల్లాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేకుండా రక్తపరీక్షల ల్యాబ్‌లు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. తనిఖీ సమయంలో ఆర్‌ఎంపీల వద్ద పెద్ద ఎత్తున ఫిజీషియన్ శాంపిల్స్ లభ్యమవుతున్నాయని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సూచనలు, సలహాలు ఇచ్చి ప్రాథమిక వైద్యం మాత్రమే అందించి పెద్ద వైద్యశాలలకు పంపాలని సూచించారు. నిబంధనలకు మించి వైద్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ మాట్లాడుతూ.. నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటామని పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి షేక్ సైదా, ట్రెజరర్ అంజుమ్ రాజు, సభ్యులు చెన్నారెడ్డి, వీరాంజనేయులు, రాజు, వెంకట్రావు పాల్గొన్నారు. మొదట డీఎంహెచ్‌వోకు సంఘ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు.

పీఎం సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి

ఏఈ షేక్ మస్తాన్‌వలి

రెంటచింతల: సౌర విద్యుత్‌ను అందరికీ చేరువ చేసి సుస్థిర ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ యోజనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ షేక్ మస్తాన్‌వలి కోరారు. బుధవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు కాలనీలలో ఆయన పర్యటించి పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఈ పథకం గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తుందన్నారు. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుని కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగిస్తున్న ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా కేంద్ర ప్రభుత్వం సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇతరులకు ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రూ.18 వేలు, రెండు కిలోవాట్లకు రూ.30 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ ఇస్తుందన్నారు. విద్యుత్ కనెక్షన్, సొంత ఇల్లు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక విద్యుత్ శాఖ సిబ్బందిని కలిసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 624 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఏఈ తెలిపారు.



నాయుడుపేట ఎస్సీ కాలనీలో పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన కల్పిస్తున్న ఏఈ వలి

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దాం

ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి

వెల్దుర్తి: మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యతల వారీగా పనులు చేపట్టాలన్నారు. రానున్న వేసవి కాలంలో గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు సరిపడా పనులు గుర్తించి అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో మురుగు కాల్వల్లో మురుగును తొలగించాలన్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులందరూ సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేయటంలో తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, ఎంపీడీఓ డి.ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభం

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లో జంగిల్ క్లియరెన్స్ పనులను బుధవారం ప్రారంభించారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు అధికారులు, కూటమి నేతలు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు. మాచర్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త భూసా రామాంజనేయులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నిధులతో విజయపురిసౌత్‌లో రహదారుల వెంట జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ మురళీధర్, జేఈలు హిమబిందు, వెంకట సుబ్బయ్య, స్థానిక టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి సైదారావు, జనసేన మండల అధ్యక్షుడు సాంబశివరావు, స్థానిక జనసేన అధ్యక్షుడు రాహుల్, నక్షత్ర ప్రసాద్, ఆడెపు కోటయ్య, సత్తిబాబు, చరణ్, గంటా ధనుంజయ రావు, కట్టారాజు, ఊరే మార్క్, రామచంద్ పాల్గొన్నారు.



కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున



రెంటచింతల: మండలంలోని గ్రామాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎవరైనా చట్ట వ్యతిరేకంగా కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌ఐ నాగార్జున మాట్లాడుతూ గ్రామాలలో కోడి పందేలు, లాటరీలు, కోతముక్క వంటి జూదం నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కోడి పందేలు నిర్వహించిన, వాటిని చూసిన నేరమని, పందేలు నిర్వహించిన స్థలం వారిపై కూడా నమోదు చేయడం జరుగుతుందని ప్రజలందరూ గుర్తించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నివారించేందుకు గ్రామాలలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతమైన వాతావరణంలో సంతోషంతో జరుపుకోవాలని కోడి పందేలకు మండల ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.

ముగిసిన జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్



విజేతలకు మెడల్స్ అందజేస్తున్న ప్రతినిధులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పిడుగురాళ్ల రూరల్: రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. రోటరీ ఇంట్రాక్ట్ స్పోర్ట్స్ మీట్ పేరిట ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రోటరీ ఇంట్రాక్టివ్ పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... క్రీడల వల్ల శారీరక, మానసిక వికాసానికి అవకాశం ఉంటుందని చెప్పారు. చిన్ననాటి నుంచే ఇష్టమైన ఆటలో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గీతికా సీబీఎస్‌సీ స్కూల్ కరస్పాండెంట్ టి. బాలగంగాధర్‌రెడ్డి, డైరెక్టర్ టి. వెంకటరామిరెడ్డి, జిల్లా రోటరీ ఇంట్రాక్టివ్ మాజీ అధ్యక్షులు వడ్లమూడి రాజ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షులు గుండా అశోక్‌బాబు, వనపర్తి రమేష్‌బాబు, పి. విష్ణుబాబు, నీరుమళ్ల రాజేష్, ముత్తారెడ్డి, గురవయ్య, సుబ్రహ్మణ్య, కొత్త హనుమంతరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, ఉటుకూరి గురునాథం, ఎలూరి పుల్లారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

దాచేపల్లి : మండలంలోని తంగెడ సమీపంలోని కృష్ణానది అవతలి ఒడ్డున వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహ స్వామి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. లక్ష్మీనరసింహస్వామి దివ్యమైన రూపం మార్గశిర మాసం(ధనుర్మాస)లో ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. గురు, శుక్ర వారాల్లో జరిగే వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను మంగళవాయిద్యాలతో ప్రారంభిస్తారు.



కిడ్స్ పాఠశాలలో భోగి మంటలను ప్రారంభిస్తున్న కేసీపీ జీఎం వెంకటరమణ



వివిధ వేషధారణలో విద్యార్థులు నృత్యాలు చేస్తున్న దృశ్యం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

సంప్రదాయాలను తెలియజేసేది సంక్రాంతి

మాచర్ల రూరల్: సంస్కృతి, సంప్రదాయాలకు నెలవైన తెలుగువారికి అతి పెద్ద పండుగ సంక్రాంతి అని భవిష్యత్తు తరాలకు పండుగ విశిష్టతను తెలిపే విధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న కిడ్స్ పాఠశాల యాజమాన్యం కృషి అమూల్యమని కేసీపీ సిమెంట్స్ జీఎం వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక తరంలో పండుగల విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సంక్రాంతి సంబరాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. విద్యార్థుల హరిదాసు, పల్లె పడుచు, గంగిరెద్దుల వేషధారణలు పలువురిని ఆకర్షించారు. అలాగే భోగిమంటలు, పొంగళ్ళు, బొమ్మల కొలువు, ముగ్గుల పోటీలు, ఆటపాటలతో సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కేసీపీ హెచ్‌ఆర్ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం కేవీఎస్ ఆర్‌కే శాస్త్రి, ఏఓ విజయ్ శేఖర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

గురజాల : లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ముగ్గుల పోటీలు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ఎస్ శ్రావణి, జి.లక్ష్మీప్రసన్నలు ప్రథమ బహుమతి, వై.కీర్తన, ఎన్ హర్షిణిలు ద్వితీయ బహుమతి, సీహెచ్ నందిని ఎస్ హేమలత, ఇందిర, రిషితలు తృతీయ బహుమతిని జూనియర్స్ విభాగంలో హరిత, హిమజలు ప్రథమ బహుమతి, కావ్య, తేజస్వినిలు ద్వితీయ బహుమతి, జ్యోతి కుమారి, నిత్యశ్రీలు తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ మన్నం బ్రహ్మనాయుడు, ప్రిన్సిపాల్ మన్నం కృష్ణ, ఉపాధ్యాయులు అరుణ, తాజూన్, రవికుమార్, నరేంద్ర, కోటేశ్వరి తదితరులున్నారు.

అభివృద్ధి పథంలో లైమ్‌సిటీ

- వైద్య పరంగా అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యకు బైపాస్ నిర్మాణం పూర్తి
- పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఎదుగుదల
- రోజు రోజుకు పెరుగుతున్న జనాభా, వ్యాపార సముదాయాలు




పిడుగురాళ్ల పట్టణ ఏరియల్ వ్యూ

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం రోజు రోజుకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ముందుకు దూసుకుపోతుంది. పెరుగుతున్న జానాభాకు అనుగుణంగా పలు వ్యాపార సముదాయాలు కూడా పెరుగుతున్నాయి. పట్టణ విస్తీర్ణం పెరుగుతుంది. మోడ్రన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు, అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. పిడుగురాళ్ల సుమారు 200 ఏళ్ల క్రితం నుంచి శివారు గ్రామంగా ఉండేది. 1945వ సంవత్సరంలో శివారు గ్రామం నుంచి పంచాయతీగా పిడుగురాళ్ల ఏర్పడింది. ఆ తర్వాత 2005లో నగర పంచాయతీగా అభివృద్ధి పొందింది. డిసెంబర్ 31, 2010లో గ్రేడ్ 2 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ అయి ప్రస్తుతం కొనసాగుతుంది. అప్పట్లో రావి చెట్టు కింద పిడుగు పడటంతో పిడుగురాళ్లగా పిలవబడుతుందని పూర్వీకులు తెలుపుతున్నారు. పిడుగురాళ్ల పట్టణం ప్రస్తుతం 31.63 చదరపు మీటర్లుగా ఉంది. ప్రస్తుతం జనాభా సుమారు 90 వేలకు పైగా ఉన్నారు. పట్టణంలో 33 వార్డులలో సుమారు 17 వేల గృహాలు ఉన్నాయి. పట్టణంలో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణానికి మంజూరు కావటంతో అందులో రెండు పూర్తి అయ్యాయి. ప్రధాన రహదారి రోడ్డు వెడల్పుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. పట్టణ ప్రజలకు గోవిందాపురం కృష్ణా నది నుంచి తాగు నీటిని అందించేందుకు నాలుగు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణంతోపాటు 10,724 గృహాలకు కొళాయిలను ఏర్పాటు చేయటం జరిగింది. సీసీ రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరించనుంది. పాఠశాల అభివృద్ధి కోసం రూ.9.88 కోట్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10.96 కోట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. అలాగే రూ.172 కోట్లతో హాస్పిటల్ నిర్మాణ పనులు చేశారు. ప్రస్తుతం పిడుగురాళ్ల పట్టణంలో ఓటర్లు 54,580 మంది ఉన్నారు. పిడుగురాళ్ల పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతూ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు సమకూరుతున్నాయి. ప్రజల రక్షణ కోసం పోలీస్ స్టేషన్‌ను అభివృద్ధి పరిచారు. రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, వైద్యశాలలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పిడుగురాళ్ల పట్టణంలో ప్రధానంగా సున్నం వ్యాపారం కావటం వలన దీనిని లైమ్ సిటీగా పిలుస్తారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు బైపాస్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావటంతో పెద్ద పెద్ద వాహనాలు, కారులు వంటివి బైపాస్ నుంచి దాటి వెళ్లటంతో ప్రధాన ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది. పట్టణం పెరుగుతుండటంతో బైపాస్ వెంట రెస్టారెంట్‌లు, కాఫీ, టిఫెన్ షాపులు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో నూతనంగా పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్‌లతో పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది.

వ్యాధి నిర్ధారణతో రోగం నయం చేయవచ్చు




వ్యాధి నిర్ధారణ జరిగితే రోగికి మూడు వంతుల రోగం నయమైనట్లే. అందుకే అనారోగ్యంతో బాధపడే వారిని ఆరోగ్యవంతులుగా చేయటానికి వైద్యులు ప్రయత్నిస్తారు. రోగ నిర్ధారణలో భాగంగా ఆరోగ్య సమస్యలను స్కానింగ్ ద్వారా కచ్చితంగా గుర్తించి రోగికి సరైన వైద్యం అందించవచ్చు.

– డాక్టర్ బి.రామ్ ప్రసాద్, ఎండీ రేడియాలజీ



పిడుగురాళ్లలోని సున్నపు బట్టీలు



బైపాస్ రోడ్డు

మొక్కలు నాటి పచ్చదనం కాపాడాలి

దాచేపల్లి : మొక్కలు నాటి పచ్చదనం కాపాడాలని ప్రిన్సిపాల్ మైల రంగారెడ్డి అన్నారు. స్థానిక స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్క సంరక్షించే బాధ్యతను విద్యార్థులకు అప్పగించారు. మొక్కలు ఎదిగినట్లే విద్యార్థులు జీవితంలో దినదినం ఎదగాలని ఆయన చెప్పారు. మొక్కలు పెంచటం ద్వారా మనిషి జీవించేందుకు అవసరమైన ఆక్సిజన్ సమృద్ధిగా లభిస్తుందని, మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రజినికుమార్ తదితరులు పాల్గొన్నారు.